బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 7 : రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు వినతి పత్రం అందజేశారు. జనవరి 7న జహీరాబాద్ మండలంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని స్వప్న ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి, ఉద్యోగం కల్పించాలన్నారు.

చెరుకు బకాయిలు చెల్లించాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్/సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 7: ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ నెల 28లోగా చెరుకు రైతులకు పెండింగ్ డబ్బులు చెల్లించాలని కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేశ్ ఆదేశాలు ఇచ్చారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ పెండింగ్ బిల్లులపై సమావేశం నిర్వహించారు. రైతులకు చెల్లించవలసిన బకాయిలు పూర్తిగా ఈ నెల 28లోగా చెల్లించి, క్రషింగ్ సీజన్ ప్రారంభించాలని కలెక్టర్ క్రాంతి ఆదేశాలు ఇచ్చారు. జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రైడెంట్ యాజమాన్యంతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూర్ రూపేశ్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

గిర్మాపూర్ గురుకులంలో విద్యార్థులతో చదివిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

- నీటి సమస్యలు లేకుండా చూడాలి
- వేసవి దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ వల్లూరి క్రాంతి

కొండాపూర్, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లాను ప్లాస్టిక్ నిషేధిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. బుధవారం కొండాపూర్ మండలంలోని తొగర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ కూడా పారిశుధ్యం లోపించకుండా చూడల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. దీనికి ప్రజలు తప్పకుండా సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ ద్వారా మూగజీవాలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. గ్రామాలతో పాటు వివిధ డాబాల్లో, దేవాలయాలు, కిరాణషాప్‌ల వద్ద ప్లాస్టిక్‌ను వాడకుండా చూడాలన్నారు. రానున్నది ఎండాకాలం కాబట్టి ఏ గ్రామంలో కూడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదన్నారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించుకోవాలని, మొక్కలు ఎండకుండా చూసుకోవాలన్నారు. క్లాత్ బ్యాగ్‌లు లేదా, పేపర్ బ్యాగ్‌లను వాడాలని సూచించారు. తొగర్‌పల్లి గ్రామం ప్లాస్టిక్ నిషేధిత గ్రామంగా తయారు చేయన్నారు. అనంతరం కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్‌లో ఉన్న గురుకుల పాఠశాలను సందర్శించారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామాల్లోని పాఠశాలలు, దేవాలయాలు, వైద్య సబ్ సెంటర్లు, తదితర పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి, తహసీల్దార్ అనిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, పీడీ లాలు, తొగర్‌పల్లి గ్రామస్తులు శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్ గౌడ్, వై.ప్రభుపాల్గొన్నారు.

భూనిర్వాసితులకు న్యాయం చేస్తాం

మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశ్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: నిజాంపేట్–బీదర్ 161బీ జాతీయ రహదారికి భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నది. ఇందులో భాగంగా బుధవారం డీఎన్‌టీ తండా, పీప్రీ, కిషన్‌నాయక్ తండాల పట్టాదారులతో ఆర్డీవో వెంకటేశ్ గ్రామసభలు నిర్వహించి, జాతీయ రహదారి గుండా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇచ్చే విషయమై వివరించడంతో పాటు వారి అనుమానాలను నివృత్తి చేశారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని, అభివృద్ధికి సహకరించాలని ఆర్డీవో సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ దేవదాస్, ఆర్ఐ శ్యామ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 7: మూడు రోజులుగా కరీంనగర్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ విద్యార్థులు పాల్గొనగా చరణ్ తేజ్ గౌడ్ విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం విద్యాసంస్థల అధినేత సలోమాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధికి నిధులు మంజూరు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.25.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి తెలిపారు. బుధవారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.15.50కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పాటు నారాయణఖేడ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. 50 నుంచి వంద ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న పక్షంలో పరిశ్రమల కల్పనకు చర్యలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారన్నారు. సమావేశంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు భోజిరెడ్డి, రమేశ్‌చౌహాన్, పండరిరెడ్డి తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

క్రికెట్ టోర్నీని ప్రారంభం

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

హత్నూర, ఫిబ్రవరి 7 : మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతిగదులు, వసతిగృహం, పాఠశాల ఆవరణ పరిశీలించారు. భోజనశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి సమస్యలపై ఆరాతీశారు. అనంతరం పలు రిజిష్టర్లు తనిఖీ చేశారు. ప్రభుత్వం వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, ఆహారం అందించేందుకు ప్రత్యేక కృషిచేస్తుందని విద్యార్థులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు మహేశ్, ప్రశాంత్, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 7: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పాత పంటల జాతర కోఆర్డినేటర్ విజయ్ కుమార్ అన్నా రు. బుధవారం మండలంలోని వడ్డి గ్రామం లో డెక్కన్ డెవలప్‌మెంట్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో 24వ పాత పంటల జాతరోత్సవాలను నిర్వహించారు.

పంటల సాగులో విపరీతంగా పురుగుల మందులు, క్రిమిసంహారిక మందులను వాడడం వల్ల భూసారం పూర్తిగా కలుషితమవుతుందన్నారు. పచ్చిరొట్టె, సేంద్రియ ఎరువులను వాడడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధులగుం డా డీడీఎస్ మహిళాసంఘాల సభ్యులు కోలా టం, చిటికెల రామాయణం, ఆటపాటలతో పాతపంటల విత్తనాలతో కూడిన ఎడ్లబండ్ల ఊరేగింపును చేపట్టారు.

వడ్డి గ్రామంలో పాత పంటల ఎడ్ల బండ్ల ఊరేగింపులో డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

దన్వార్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మనూరు, ఫిబ్రవరి 7 : గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధన్వార్ గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నదన్నారు. పారిశుధ్యం, మంచినీటి ట్యాంకుల శుభ్రత, తదితర వంటి పనులపై దృష్టిసారించాలన్నారు. అంతకుముందు రాయిపల్లి గ్రామంలో ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్మీ శిక్షణ నిర్వహిస్తున్నందున వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాజీలొద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, భవిష్య భారత్ కోఆర్డినేట్ జహంగీర్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 7: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని మొగుడంపల్లి ఎంపీపీ ప్రియంక తెలిపారు. బుధవారం మొగుడంపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి పరిష్కరించాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యక్షురాలు ప్రియాంక

‘ఆదర్శ’ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

పుల్కల్, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని బస్వాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిపై చర్యలు తీసుకోవాలని బుధవారం బజరంగ్‌దళ్ ప్రముఖ్ సుభాష్‌చందర్ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులు కలెక్టర్ వల్లూరి క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు క్రైస్తవ మత బోధనలు చేయిస్తూ, విద్యార్థులతో ప్రార్థనలు చేయించిన ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యం లేదని ఎంఈవో, డీఈవోలకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి తీర్మానం

జిన్నారం, ఫిబ్రవరి 7: మాదారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన సమావేశంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ మల్లేశం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.15 లక్షల నిధులతో గ్రామంలో కోర్పల్లిబస్తీ, లింగమయ్య గుడి వద్ద రెండు చోట్ల సీసీరోడ్లు వేసేందుకు గ్రామస్తులతో చర్చించి పంచాయతీ కార్యదర్శి నవీన్ తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, గణేశ్, సుదర్శన్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు 71 మంది విద్యార్థుల ఎంపిక

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7 : తెల్లాపూర్ మున్సిపాలిటీ వెలిమెల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు, మలబార్‌గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ వారు అందజేసే స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో మెరిట్ సాధించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న 71 మంది విద్యార్థులకు బ్యాంక్ ఖాతాలో ట్రస్ట్ డబ్బులు జమ చేసిందని పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయికోడ్, ఫిబ్రవరి 7: పేకాట రాయుళ్లను అరెస్టు చేసిన ఘటన బుధవారం ఖామ్‌జల్‌పూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఖామ్‌జల్‌పూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశారు. నిందితులు శ్రీనివాస్‌రెడ్డి, హనుమరెడ్డి, ప్రశాత్‌రెడ్డి, మహిధర్‌రెడ్డి, అబ్దుల్‌రాహిమ్, అంజిరెడ్డి, సల్‌మన్‌లను అరెస్టు చేశారు. ఈ దాడిలో సిబ్బంది సంగారెడ్డి, గౌస్, రవి, వసుసింగ్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి

ఊరూరా గ్రామసభలు.. పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 7 : గుమ్మడిదల మండలం బొంతపల్లిలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సద్ది ప్రవీణా విజయ భాస్కర్‌రెడ్డి నాయకులు గ్రామస్తులతో కలిసి చీపుర్లు పట్టి రోడ్లుశుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామం బాగుండాలంటే పారిశుధ్యం ముఖ్యమని, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, వీరభద్ర స్వామి ఆలయకమిటీ మాజీ అధ్యక్షుడు ఆలేటి శ్రీనివాస్ రెడి పాల్గొన్నారు.

గుమ్మడిదల: బొంతపల్లిలో చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేస్తున్న నాయకులు

శుభ్రత పాటించాలి

కోహీర్, ఫిబ్రవరి 7: పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని డీఆర్డీవో ఏపీడీ సూర్యారావు అన్నారు. బుధవారం కోహీర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో చేపట్టిన ప్రత్యేక గ్రామసభల్లో ఏపీడీ సూర్యారావు మాట్లాడారు. గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని కోరారు. తహసీల్దార్ శాంతకుమారి, ఎంపీడీవో సుజాతానాయక్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

పుల్కల్, ఫిబ్రవరి 7 : పారిశుధ్యంపై అధికారులు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన పుల్కల్‌తో పాటు, ముద్దాయిపేట, గొంగ్లూర్ గ్రామాల్లో పంచాయితీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి వామన్‌రావ్, ఎంపీవో శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్,ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాలను స్వచ్ఛంగా మారుద్దాం

కంది, ఫిబ్రవరి 7 : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఎంపీవో మహేందర్‌రెడ్డి ప్రత్యేక అధికారులకు సూచించారు. కంది మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌తో పాటు గ్రామసభలు నిర్వహించారు. ఇంద్రకరణ్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రత్యేక అధికారులకు సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు.

గ్రామసభలు నిర్వహించాలి

రాయికోడ్, ఫిబ్రవరి 7 : గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని మండల పంచాయతీ రాజ్ ఏఈ, ప్రత్యేక అధికారి శశికుమార్ అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్‌ల కాలపరిమితి ముగిసిపోవడంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా మండల, జిల్లాస్థాయి అధికారులను నియమించింది. బుధవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేశారు. అధికారులు జగదీశ్, వెంకటేశం, శ్రీనివాస్, శశికుమార్,అవినాశ్ వర్మ, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, విజయ కుమార్, రవి కుమార్, చౌహాన్ పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

వట్‌పల్లి, ఫిబ్రవరి 7: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగులపల్లిలో ఆయన పర్యటించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలన్నారు. ఎప్పటికప్పుడూ సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. మండలాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7 : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యమని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీ 4,7 బ్లాక్‌ల్లో కార్పొరేటర్ బస్తీదర్శన్ నిర్వహించారు. అనంతరం బస్తీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కొత్తగా యూజీడీ పనులు చేశామని, త్వరలోనే సీసీ రోడ్డును వేయిస్తామని బస్తీవాసులకు తెలిపారు. ఆమె వెంట అలీబాబా, హబీబ్, అబ్దుల్‌గఫర్, ఎర్ర మల్లి, మల్లికార్జున్, ఖాజా, మహేశ్, మోహన్ తదితరులు ఉన్నారు.

బస్తీవాసులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

క్వారీలపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం, ఫిబ్రవరి 7: మాదారం పంచాయతీ పరిధిలోని కంకర క్వారీలతో తాము తీవ్రఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాటి నుంచి వచ్చే దుమ్ముధూళితో అనారోగ్యాలకు గురవుతున్నామని తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను మాదారం గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ కార్యాలయం, జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కంకర క్వారీలో జరిగే పేలుళ్లతో గ్రామంలోని ఇండ్లన్నీ బీటలు పారుతున్నాయని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో ఎం.సుదర్శన్, సీహెచ్ గణేశ్, రమణసింగ్ ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

జిన్నారం, ఫిబ్రవరి 7: ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నేత భాస్కర్‌రెడ్డి కోరారు. బుధవారం ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని టీబీడీసీ పరిశ్రమ ఆవరణలో కరపత్రాలను పంపిణీ చేశారు. సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

హత్నూర, ఫిబ్రవరి 7: కరెంట్‌షాక్‌తో రైతు మృతిచెందిన సంఘటన హత్నూర మండలం బోర్పట్లలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారిశ్రీరాములు (63) వ్యవసాయ పొలం వద్ద పంపుసెట్ స్టార్ట్ చేయగా, కరెంట్‌షాక్‌తో అక్కడే పడిపోయాడు. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే శ్రీరాములు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు

బొల్లారం, ఫిబ్రవరి 7 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ బస్తీలో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా, సిలిండర్‌పేలి ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ నయీమొద్దీన్ వివరాల ప్రకారం.. పోచమ్మబస్తీకి చెందిన బుచ్చయ్య గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా సిలిండర్ పేలింది. దీంతో బుచ్చయ్యతో పాటు ఆయన భార్య, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై పెంటారెడ్డి కుమారుడు శ్రీరాములు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత

పరీక్ష ప్యాడ్లతో గురుకుల విద్యార్థులు

జిన్నారం, ఫిబ్రవరి 7 : జిన్నారం గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షాసామగ్రిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి అవకాశాలపై వర్క్‌షాప్

అందోల్, ఫిబ్రవరి 7 : అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలో యువతకు ఉపాధి కల్పనలో భాగంగా బుధవారం జోగిపేటలో ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించినట్లు డెవలప్‌మెంట్ అధికారి వందన తెలిపారు. వర్క్‌షాప్‌లో పెద్ద ఎత్తున యువత పాల్గొనగా, వివిధ రంగాల్లో ఉపాధిపై అవగాహన కల్పించారు. 90 మంది యువతీ,యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ దుర్గారెడ్డి, ట్రైనర్లు రాములు, భిక్షపతి ఉన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో స్వచ్ఛతతో పాటు మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ రూపొందించిందని ప్రత్యేకాధికారి ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం గంగారాంతండా పంచాయతీలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తండావాసులు సురేశ్, నామ్‌దేవ్, వాలునాయక్, రఘునాథ్ సతీశ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి వసంత పంచమి ఉత్సవాలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 7: మండలంలోని రాఘవపూర్‌లోని సిద్ధిసరస్వతీ దేవస్థాన పంచవటీ క్షేత్రం వసంత పంచమి మహోత్సవాలకు ముస్తాబైనట్లు క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా తెలిపారు. 9 నుం చి 16 తేదీ వరకు ప్రత్యేక పూజలు, సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అందోల్, ఫిబ్రవరి 7 : గౌడ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన పెత్తందారులను చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జోగిపేటలో మాట్లాడుతూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన వంద కుటుంబాలను విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ)పేరుతో కులవృత్తి చేసుకుంటున్న వారిని వేధించడమే కాకుండా గ్రామం నుంచి బహిష్కరించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సమన్వయంతోనే అభివృద్ధి


బుదేరాలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ఎల్లయ్య

మునిపల్లి, ఫిబ్రవరి 7 : గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఉంటేనే గ్రామాలు అభివృద్ధి పథంలో పరుగులు పెడతాయని సంగారెడ్డి జిల్లా జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని బుధేరాలో నిర్వహించిన గ్రామసభలో జడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవ్వడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారులపాలన కొనసాగుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ తెన్మలి గ్రామాల్లో పర్యటించి గ్రామసభలను పరిశీలించారు. మండలంలోని ఖమ్మంపల్లిలో పలు వార్డుల్లో పర్యటించి మురుగు కాల్వల్లో పేరుపోయిన చెత్తను తక్షణమే తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి ఎంపీడీవో హరినందన్‌రావు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ–వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది. మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: 19 ఫిబ్రవరి, 2024న మ. 12.30గం. నుండి మ. 3.30గం. మధ్య (ఇ–వేలం సమయం) ఇ–వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	జహీరాబాద్	XXXXXXXXXXXX1585	నంది హనోక్	168649	16-జనవరి-24	50.5	47.7
2	జహీరాబాద్	XXXXXXXXXXXX9941	మహ్మద్ వసియుద్దీన్	403949	16-జనవరి-24	118.9	104.5

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. **12.30** గం. నుండి మ.**3.30**గం. మధ్య నిర్వహించబడును.
సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.
అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్